క్లుప్తంగా

డీఎస్సీలో గంగపుత్రుల ప్రతిభ


కోడజ్యోతి


కోడ అమ్మాజీ


సిరిపల్లి మానస


కందాల రాజు

నక్కపల్లి: మండలంలో మత్స్యకార గ్రామాలకు చెందిన పలువురు అభ్యర్థులు ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటారు. దొండవాకకు చెందిన మత్స్యకారుడి కుమార్తెలు కోడ జ్యోతి, అమ్మాజీ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. కందాల రాజు డీఎస్సీకి ఎంపికయ్యాడు. ఈయన తండ్రి చిన్నప్పటి నుంచి పక్షవాతంతో బాధపడుతుండగా.. తల్లి కూలిపని చేసుకుంటూ చదివించింది. తండ్రి చిన్నప్పుడే చనిపోవడంతో తల్లి అన్ని తానై పెంచిన సిరిపల్లి మానస కూడా డీఎస్సీకి ఎంపికై సత్తా చాటింది.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు తెలిపారు. 10 అంశాలతో కూడిన అజెండాను సమావేశంలో చర్చించడానికి సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశానికి సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

యూరియా కొరతపై ధర్నా నేడు

మునగపాక: రైతులకు సకాలంలో యూరియా అందుబాటులోకి తీసుకురాకపోవడాన్ని నిరసిస్తూ మునగపాకలో రైతులతో కలిసి మంగళవారం ధర్నా చేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్ జోరందుకున్న సమయంలో రైతులకు అవసరమైన యూరియా లేకపోవడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేయనున్నామన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతి అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ తదితర నాయకులు ఈ ధర్నాకు హాజరు కానున్నారన్నారు. రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

కాలువ నిర్మాణానికి భూమిపూజ


కాలువ పనులకు భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ

మునగపాక: ప్రతి ఒక్కరూ గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. మండలంలోని తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిలో తన కోటా నుంచి మంజూరైన రూ.5లక్షల వ్యయంతో నిర్మించనున్న కాలువ పనులకు ఆయన సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ ద్వారా తన కోటా నుంచి వచ్చే నిధులతో గ్రామాల్లో రహదారులు, కాలువలు నిర్మిస్తున్నామన్నారు. అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, పెద్దలు షేక్ ఇస్మాయిల్, కోటేశ్వరరావు, పరమేష్, నాయుడు, గంగాజీ, రవిశంకర్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


అడ్డురోడ్డులో ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఎస్.రాయవరం: నిర్ణయించిన ధరకే ఎరువులు అమ్మాలని, అక్రమ నిల్వలు ఉండటానికి వీలు లేదని తహసీల్దార్ జె.రమేష్‌బాబు ఆదేశించారు. అడ్డురోడ్డు, ఎస్.రాయవరంలోని ఎరువుల దుకాణాల్లో సోమవారం వ్యవసాయాధికారులతో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా దుకాణదారులు చూడాలని, అక్రమంగా విక్రయాలు చేసినా, నిల్వలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయాధికారి సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

ఎకోదంతుడికే జై

విశిష్టమైనది మన భారతీయ సంస్కృతి. మన సంప్రదాయాల్లోనే ఆరోగ్యసూత్రాలను ఇమిడ్చారు విజ్ఞాన సంపన్నులైన మన పూర్వీకులు. పండగలూ అందులో భాగమే. ఋతు ధర్మాలను అనుసరించి, మనం ఆచరించాల్సిన నియమాలు రూపొందించారు. భాద్రపదమాసం ..వర్షాకాలం కావడంతో చెరువుల్లో, కాల్వల్లో పూడికలు తొలగించి మట్టి గణపతి ప్రతిమలను రూపొందించడం.. పార్వతీ తనయుడిని అర్చించిన అనంతరం ఔషధ విలువలు గల 21 రకాల పత్రితో అర్చించడం అందులో భాగమే. మధ్యలో వచ్చిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను దూరం పెట్టి మళ్లీ మట్టి గణపతివైపే మొగ్గు చూపుతూ పర్యావరణ హితమైన పండగకు సిద్ధమవుతున్నారు పల్లె ప్రజలు.

- మట్టి గణపతి పైనే భక్తుల మొగ్గు
- ఆర్డర్లపై తీర్చిదిద్దుతున్న స్థానిక కుమ్మర్లు
- చవితి శోభతో చిరు వ్యాపారుల్లో జోష్


అడ్డురోడ్డులో విక్రయిస్తున్న మట్టి గణపతి ప్రతిమలు

ఎస్.రాయవరం: పెరుగుతున్న పర్యావరణ అవగాహన కారణంగా మట్టి గణపతి విగ్రహాలను పూజించాలనే సత్సంకల్పం భక్తుల్లో పెరుగుతోంది. స్థానిక కుమ్మర్లు ఆర్డర్లపై తయారు చేస్తున్న మట్టి విగ్రహాలే ఇందుకు నిదర్శనం. ఈ సారి చేసిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల జోలికి ఉత్సవ కమిటీలు ఎక్కువగా పోలేదు. మరోవైపు చవితి శోభతో చిరు వ్యాపారుల్లో జోష్ కనిపిస్తోంది. మండలంలో అడ్డురోడ్డు వాణిజ్య కేంద్రం, మండల కేంద్రాల్లో చిరువ్యాపారులు గణపతి ప్రతిమలు, పూజా సామగ్రి, ఫలాలు విక్రయించేందుకు భారీగా దుకాణాలు తెరిచారు. కొరుప్రోలు, ఎస్.రాయవరం గ్రామాల్లో కుమ్మరి కుటుంబాల మహిళలు స్వయంగా వందల సంఖ్యలో మట్టి గణపతి ప్రతిమలు తయారు చేశారు. ఇప్పటికే ఆర్డర్లపై తయారు చేసిన ప్రతిమలను అందజేసి, మిగతా వాటిని మార్కెట్‌కి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పూజకు అవసరమైన పాలవెల్లి, 21 రకాల పత్రిళ్లు, పండ్ల విక్రయాలతో మార్కెట్లకు చవితి శోభ వచ్చింది. నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలకు చెందిన సుమారు 50 గ్రామాలకు ముఖ్య కూడలి అడ్డురోడ్డు కావడంతో గణపతి ప్రతిమలు, పూజా సామగ్రి విక్రయాల స్టాళ్లు అధిక సంఖ్యలో ఏర్పాటు చేశారు. దీంతో ఈ జంక్షన్ సందడిగా మారింది.

మట్టి ప్రతిమలకు గిరాకీ



గణపతి మట్టి ప్రతిమలను స్వయంగా తయారు చేసి మూడు రోజులుగా అడ్డురోడ్డులో విక్రయాలు ప్రారంభించాను. ఇప్పటికే 50 శాతం ప్రతిమలు అమ్మేశాను. మట్టి ప్రతిమలను ఎక్కువగా భక్తులు అడుగుతున్నారు. వీటి విక్రయాలు ఈ ఏడాది బాగున్నాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన ప్రతిమలకు గిరాకీ తగ్గింది.

– అనకాపల్లి రమ్యశ్రీ, కొరుప్రోలు


పూజా సామగ్రి విక్రయాలు

మందకొడిగా పూజా సామగ్రి విక్రయాలు



వినాయక చవితికి ఏటా ప్రత్యేకంగా పండ్లు, పత్రిళ్లు, పూల దుకాణం పెడుతుంటాను. ప్రస్తుతం విక్రయాలు కాస్త మందకొడిగా ఉన్నాయి. చవితి ముందు రోజు మంగళవారం పెద్ద ఎత్తున విక్రయాలు జరుగుతాయి. గత కొన్నేళ్లుగా చేస్తున్న ఈ వ్యాపారం ఎప్పుడూ అనుకూలంగానే సాగుతుంటుంది.

– నారాయణమ్మ, చిరువ్యాపారి, పెదగుమ్ములూరు

'దివ్యాంగులపై ప్రభుత్వం కక్ష సాధింపు'


ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం: దివ్యాంగులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దారుణమని సీపీఎం నాయకులు ఆర్.రాము, కె.సోమునాయుడు ధ్వజమెత్తారు. దివ్యాంగుల పెన్షన్ల కోతను నిరసిస్తూ సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మండల పరిధిలో 160 మందికి నోటీసులు ఇచ్చి 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందని పేర్కొంటూ పింఛన్లు తొలగించడం దారుణమన్నారు. అభాగ్యులకు ఏదో విధంగా ప్రభుత్వం అండగా ఉండాల్సింది పోయి ఇలా పెన్షన్లు తొలగించడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. పెన్షన్ మొత్తం పెంచి లబ్ధిదారుల సంఖ్యను కుదించడం అన్యాయమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు మండల పరిషత్ సమావేశం

యలమంచిలి రూరల్: యలమంచిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కొండలరావు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు ఆయా శాఖల ప్రగతి నివేదికలతో అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

మట్టి గణనాథుడినే పూజించాలి


మట్టి విగ్రహాలతో చినదొడ్డిగల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


దిబ్బపాలెంలో మట్టి వినాయక ప్రతిమలతో మహిళలు

నక్కపల్లి: వినాయక చవితిని పురస్కరించుకుని మట్టి ప్రతిమలనే పూజించాలని కోరుతూ సోమవారం చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించరాఉ. మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను పట్టుకుని అవగాహన కల్పించారు. రంగులు వద్దు, పచ్చదనం ముద్దు అంటూ ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులు మట్టి ప్రతిమలను పూజించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు వెంకటరమణ తెలిపారు. విద్యార్థులు మట్టితో తయారు చేసిన విగ్రహాలను గ్రామంలో ఉచితంగా పంపిణీ చేశారు.

మునగపాక: గవర్ల అనకాపల్లిలో చదరం సూరప్పారావు సమకూర్చిన మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు సోమవారం శ్రీ ధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల జోలికి పోరాదన్నారు. ఈ కార్యక్రమంలో తోటాడ మాజీ సర్పంచ్ పొలమరశెట్టి నాగేశ్వరరావు, పెద్దలు దాడి గంగాజీ, ఎం.వీరునాయుడు, దాడి శ్రీను, ఆళ్ల వెంకటేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: మండలంలోని సెజ్ కాలనీ దిబ్బపాలెం పంచాయతీలో 2 వేల మట్టి వినాయక విగ్రహాలను లారస్ లాబ్స్ ప్రతినిధి దావా నరసింగరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.మోహన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


గవర్ల అనకాపల్లిలో మట్టి వినాయక ప్రతిమలు అందిస్తున్న శ్రీధర్మ ఫౌండేషన్ చైర్మన్ సాయికృష్ణ

రేషన్ డీలర్లు సమయ పాలన పాటించాలి

మునగపాక: మండలంలోని రేషన్ దుకాణాలను ప్రతి నెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు అందుబాటులో ఉంచాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం మండల రేషన్ డిపో డీలర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలన్నారు. ఇంటి నుంచి డిపోకు రాలేని వారి ఇళ్లకు వెళ్లి సరకులు అందించేలా చూడాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయంతో గణపతి ఆలయానికి మెట్ల నిర్మాణం

నక్కపల్లి: ప్రసిద్ధి చెందిన ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి ఆలయానికి దేవవరం పంచాయతీకి చెందిన దాతలు మెట్ల మార్గాన్ని నిర్మించారు. ప్రధాన ఆలయానికి ఎదురుగా రాళ్లతో ఉన్న ప్రాంతాన్ని నాలుగేళ్ల క్రితం చదును చేశారు. గతేడాది ఆలయానికి దక్షిణ వైపు నుంచి కొండపైకి ప్రభుత్వ నిధులు, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన దాతలు ఇచ్చిన విరాళాలతో సుమారు రూ.20 లక్షలు వెచ్చించి సర్పంచ్ గొర్లె రాఘవకుమారి ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ రోడ్డు మీదుగా కొండపైకి చేరుకున్న భక్తులు ఆలయంలోకి రాకపోకలు సాగించేందుకు వీలుగా దేవవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉప సర్పంచ్ వేగేశ్న అప్పలనర్సింహరాజు(చంటి), వేగేశ్న రామకృష్ణరాజు, ఒడ్డిమెట్టకు చెందిన పైలా నూకన్ననాయుడు, చినరామభద్రపురానికి చెందని సఖిరెడ్డి వెంకటరమణ సుమారు రూ.1.50 లక్షలు వెచ్చించి మెట్లను, దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ప్రత్యేకంగా ర్యాంపును నిర్మించారు. ఈ మెట్ల మార్గాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం రామకృష్ణ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొర్ల నర్సింహమూర్తి, దండు బలరామరాజు, పైలా సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.


దాతలు నిర్మించిన మెట్లమార్గాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు వీసం రామకృష్ణ

స్నేహితుని కుటుంబానికి పూర్వ విద్యార్థుల చేయూత


స్నేహితుని కుటుంబానికి సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మునగపాక: కష్టాల్లో ఉన్న స్నేహితుని కుటుంబానికి పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1999–2000లో పదో తరగతి చదువుకున్న కస్పా అప్పలనాయుడు దువ్వాడలోని వీఈపీ జెడ్‌లో ఉద్యోగం చేసేవారు. ఈయన విధులు ముగించుకొని ఆర్టీసీ బస్సులో ఇంటికి వస్తున్న క్రమంలో టైర్లు పేలిపోవడంతో కాళ్లు విరిగిపోవడంతో శస్త్ర చికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే. దీంతో అప్పలనాయుడు కుటుంబానికి తమవంతు సాయం చేసేందుకు పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. రూ.25వేలు నగదును సేకరించి అప్పలనాయుడుకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పిల్లా జగదీష్, టెక్కలి అప్పలనాయుడు, దాడి అరుణ్‌కుమార్, విల్లూరి రాము, బొడ్డేటి చంద్రశేఖర్, కస్పా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జికి సత్కారం


నరసింగరావును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

మునగపాక: రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విల్లూరి నూకనరసింగరావు అన్నారు. ఇటీవల పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఆదివారం రాత్రి మునగపాకలోని సంతబయల శ్రీకృష్ణ యువజన కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగపాక పీఏసీఎస్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే పెంటకోట అభివృద్ధి

పాయకరావుపేట: వైఎస్సార్‌సీపీ హయాంలోనే పెంటకోట గ్రామం అభివృద్ధి చెందిందని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. పెంటకోట గ్రామంలో ఆదివారం జరిగిన సభలో హోంమంత్రి అనిత సమక్షంలో టీడీపీ నాయకుడు గూటూరు శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు. ఈ మేరకు సోమవారం విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా మాట్లాడుతూ పెంటకోట గ్రామంతో పాటు మండలంలోని అన్ని పంచాయతీలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి చెందాయన్నారు. గూటూరు శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు అనితను విమర్శించిన సంగతి మరచిపోయారా, పార్టీ మారి వైఎస్సార్‌సీపీ నాయకులను వ్యక్తిగతంగా విమర్శించడం తగదన్నారు. పాయకరావుపేటకు చెందిన గూటూరు.. పెంటకోట అభివృద్ధి చెందలేదనడం విడ్డూరంగా ఉందన్నారు. మాసాహేబుపేట సర్పంచ్ గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెంటకోటలో ఉన్న కల్వర్టును గత ప్రభుత్వంలో పూర్తి చేయించుకోలేకపోయారని విమర్శించడం అవగాహన లోపమేనని చెప్పారు. పెంటకోట కల్వర్టు పునర్నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయన్నారు. అప్పట్లోనే పనులు ప్రారంభించాల్సిన కాంట్రాక్టర్‌కి, ప్రభుత్వానికి ఏర్పడిన సమస్యల కారణంగా కల్వర్టు పనులు నిలిపివేశారన్నారు. అంతేగాని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, కల్వర్టు నిర్మాణానికి ఏమీ సంబంధం లేదన్నారు. కాంట్రాక్టర్ పనిచేయకపోవడం, కోర్టుకి వెళ్లడం కారణంగానే కల్వర్టు పూర్తి కాలేదన్నారు. అవగాహన లోపంతో గూటూరు మాట్లాడడం తగదన్నారు. పెంటకోట సర్పంచ్ చేపల నాగమణి తాతాజీ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో శంకుస్థాపనలు చేసి వదిలేసిన పలు అభివృద్ధి పనులను వైఎస్సార్‌సీపీ పాలనలో పూర్తి చేశామన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల కల్పన వైఎస్ జగన్ హయాంలోనే జరిగాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రక్తదానం ప్రాణదానంతో సమానం


యలమంచిలిలో ఓ ప్రైవేటు కళాశాలలో రక్తం దానం చేస్తున్న విద్యార్థులు


అచ్యుతాపురంలో రక్తదానం చేస్తున్న యువకులు

యలమంచిలి రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కోర్టుపేటలో ఓ ప్రైవేటు కళాశాలలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులుగా చేస్తున్నారన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ యలమంచిలి ప్రతినిధి కుమారి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం: బ్రహ్మ కుమారీస్ సంస్థ విశ్వ బంధుత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని అచ్యుతాపురం గ్రామంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. స్థానిక బ్రహ్మ కుమారీలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఐద్వా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

అచ్యుతాపురం: అనంతపురంలో అక్టోబర్ 13వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా ప్రతినిధులు ఆర్.కుమారి, విజయ, మంగతాయారు, పార్వతి, సుధా, బాల కోరారు. ఈ మేరకు సోమవారం అచ్యుతాపురం జంక్షన్‌లో మహాసభల పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాండెక్స్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలోని హోటళ్లు, షాపింగ్ మాల్స్‌లో పని చేస్తున్న మహిళలపై దాడులు జరుగుతున్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళల హక్కులపై పోరాటం చేస్తామన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా ప్రతినిధులు

జిల్లా స్థాయి చెడుగుడు పోటీల విజేత గణపర్తి జట్టు

మునగపాక: గణపర్తిలో మోదకొండమ్మ అమ్మవారి పండగ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి చెడుగుడు పోటీల్లో గణపర్తి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. జంపాలెం టీమ్ ద్వితీయ, మడకపాలెం టీమ్ తృతీయ, నరసింగబల్లి నాలుగో, మునగపాక జట్టు ఐదో స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు స్థానిక నాయకుల చేతుల మీదుగా సోమవారం బహుమతులు అందజేశారు.

హామీల కోసం కట్టుబడ్డ నేత వైఎస్ జగన్

- వాటిని తుంగలోకి తొక్కిన నాయకుడు చంద్రబాబు
- కూటమి ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి
- వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీ
- చెర్లోపాలెం, మడకపాలెం, రామగిరి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'


చెర్లోపాలెంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీ


మడకపాలెం రచ్చబండకు హాజరైన ప్రజలు

మునగపాక: ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న నేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి ప్రస్తుత సీఎం చంద్రబాబని దుయ్యబట్టారు. మండలంలోని చెర్లోపాలెం, మడకపాలెం, రామగిరి గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నవరత్న పథకాలు ప్రవేశపెట్టి అర్హులందరికీ అందజేశామని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పేరిట బూటకపు హామీలు గుప్పించి ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. తమ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలకు నేడు పేర్లు మార్చి అమలు చేస్తూ కోతలు విధిస్తున్నారన్నారు. ఖరీఫ్ సీజన్ ఊపందుకున్న తరుణంలో ఎరువుల కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో చేసిన తప్పులు మరోసారి చేయకుండా ప్రజల కోసం తపించే జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని ఆయన కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా గతంలో పథకాలు దక్కేవని, నేడు అటువంటి పరిస్థితులు లేవన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు బొడ్డేడ లిల్లి, సర్పంచ్‌లు అప్పికొండ సత్యవతి, జాజుల వెంకటరావు, దొడ్డి సూరప్పారావు, అయినంపూడి విజయభాస్కరరాజు, మాజీ సర్పంచ్‌లు దవులూరి అప్పలనాయుడు, నమ్మి చిరంజీవి, ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్ కుమార్, రావి శోభన్‌బాబు, పార్టీ నాయకులు రాయి బుజ్జి, అప్పలరాజు, పిన్నమరాజు రవీంద్రరాజు, శ్రీనివాసరావు, పంచదార్ల శంకరరావు, కొత్తపల్లి నాగేశ్వరరావు, యలమంచిలి రాంబాబు, ఉల్లింగల కుమార్‌రాజు, ప్రసాద్, పక్కుర్తి అప్పలరాజు, పల్లా రాజు, పక్కుర్తి బాబూరావు, నాయుడు, బొద్దపు శ్రీరామమూర్తి, కేశవరావు, కళ్యాణం, రాము, నరసింగరావు, సన్నిబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.